# పండుగలు - పరమార్థాలు

- డా॥ నాగభైరవ ఆదినారాయణ

**సంస్కృతి నిలిపీ, సంపద కూర్చీ,**
**సంతసమిచ్చును పండుగలు**
**మంచిని పెంచీ, వేదన త్రుంచీ**
**వేడుక లిచ్చును పండుగలు**

మన ఇంట్లో పలురకాల పండుగలను జరుపుకుంటూ ఉంటాం గదా! అది ఏ పండుగైనా ఇంట్లో ఉండే పిల్లల నుండి పెద్దల వరకు ఎంత పండుగో! ఎంత ఉత్సహమో ! ఎంత సందడో!

### ఇంతకూ పండుగ అంటే ఏమిటి ?

మన కోరికలు నెరవేరినప్పుడు నలుగురు కలిసి ఆనందంగా, ఉత్సాహంగా నిర్వహించుకునే కార్యక్రమాలనే



పండుగలు అని పిలుచుకుంటాం. ఈ పండుగలనే 'పర్వం' అని, 'పబ్బం' అని కూడా అంటారు.

### మరి పండగలు ఎలా ఏర్పడతాయి ?

ఒక్కో పండుగ ఏర్పడడానికి ఒక్కో ప్రత్యేకమైన కారణం ఉంటుంది.

1. చెడును నాశనం చేసి మంచిని గెలిపించిన వాళ్ల పేర్లతో ఉత్సవాలు, పండుగలు చేస్తాం

ఉదా ః- దసరా, నరకచతుర్దశి

2. లోకకళ్యాణం కోసం అవతరించిన మహాపురుషులు, అవతారపురుషులు జన్మించిన రోజులను పండుగలుగా జరుపుకుంటాం.

ఉదా ః- శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి.

3. సూర్యచంద్రుల గమనం వలన, ఋతువుల మార్పుల వలన, ప్రకృతిలో కలిగే మార్పుల వలన కొన్ని



పండుగలు ఏర్పడతాయి.

ఉదా ః- ఉగాది, మకరసంక్రాంతి.

4. తమకు ప్రయోజనం కలిగిన సందర్భంలో ఆనందం ప్రకటించే సందర్భాలు కూడా పండుగలు అవుతాయి.

ఉదా ః- భోగి, దీపావళి.

5. కాలానుగుణమైన పనులను గుర్తు చేసుకోడానికి పండుగలు ఏర్పాటయ్యాయి.

ఉదా ః- ఏరువాక, రక్షాబంధన్.

6. భయాలు కలిగినప్పుడు, దేవతల అనుగ్రహం పొందడానికి చేసే కార్యక్రమాలు పండుగలుగా ఏర్పడ్డాయి.

ఉదా ః- నాగులచవితి, గంగజాతర.



### ఈ పండుగలు ఎందుకు జరుపుకోవాలి ?

పండుగలు జరుపుకోవడం వల్ల మనకూ, మన సమాజానికి ఎన్నో లాభాలు సమకూరుతాయి అవి.

1. కష్టాలను మరిపించి, ఉత్సాహాన్ని కలుగజేస్తాయి. సంక్రాంతి నాటికి పండించిన పంటలు ఇంటికి చేరడంతో రైతులు కష్టాలన్నింటిని మరచి ఆనందంగా ఉంటారు.

2. బంధుమిత్రులను, స్నేహితులను ఒక చోటకు చేర్చి, అందరి మధ్య సోదరభావం అంకురింపజేసి, జాతీయ సమైక్యతకు తోడ్పడతాయి. కులమతభేదాలను పోగొట్టి ప్రజలలో సోదరభావాన్ని కలుగజేస్తాయి.

3.పండుగల సందర్భంగా చేసే వంటకాల వలన అనారోగ్యాలు అంతరించిపోతాయి. ఆరోగ్యం సమకూరుతుంది.

4. పండుగ సందర్భాల్లో శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రజలు చెడు తలపులు విడిచిపెడతారు.

5. పండుగలు ఆధ్యాత్మిక చింతన కలిగిస్తాయి. దానివలన మనిషిలో ధార్మిక ప్రవర్తన కలుగుతుంది.

6. ప్రజలు ఆందోళనకు, అలజడికి దూరమవుతారు. ప్రశాంతంగా ఉంటారు.

7. పండుగల వేళ ఆలయాల ఆదాయం పెరగడంతో, ఆ సొమ్ముతో ప్రజోపయోగ కార్యక్రమాలు చేసే అవకాశం ఉంటుంది.

8. పండుగల వలన వ్యాపారులకు ఆదాయం, వివిధవృత్తులకు జీవనోపాధి, బీదసాదలకు ఆహారం, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తాయి.

9. అవతారపురుషులు, వీరుల వృత్తాంతాలను



వినడం వల్ల ప్రజలు స్ఫూర్తిని పొంది మంచి, చెడు తెలుసుకుంటారు.

**ఈ పండుగలు ఎలా జరుపుకోవాలి ?**

పండుగలు సంస్కృతికి ప్రతిబింబాలు. పండుగను జరుపుకొనే విధానంలో ఒక్కో పండుగకు ఒక్కోరకమైన ఆచారాలు ఉన్నా, అన్ని పండుగలకు సాధారణమైన ఆచారాలు కొన్ని ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

1. పండుగరోజు ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలి. మామిడి ఆకులతో, పూలదండలతో అలంకరించి, ముంగిళ్ళలో ముగ్గులు పెట్టుకోవాలి.

2. దేవాలయాలను, దాని పరిసరాలను శుభ్రం చేసి విద్యుద్దీపాలతో, మామిడి తోరణాలతో, పూలదండలతో అలంకరించాలి.



3. తలంటు స్నానం చేసి, కొత్తబట్టలుగాని, చలువ చేసిన బట్టలు గాని ధరించాలి. తగినవిధంగా అలంకరించుకోవాలి.

4. కాలానుగుణంగా ప్రత్యేకమైన వంటకాలు చేసి దేవునికి నైవేద్యం పెట్టాలి.

5. జాతీయపండుగల సందర్భంలో బడిని, దాని పరిసరాలను శుభ్రం చేయాలి.

6. దేవాలయంలో గాని, ఇంట్లోని పూజామందిరంలో గాని టెంకాయను కొట్టాలి. ధూపదీపనైవేద్యాలు దేవునికి నివేదించాలి. టెంకాయే ఎందుకు కొట్టాలంటే అందులో తీర్థమూ, ప్రసాదమూ రెండూ ఉంటాయి గదా!



7. కర్పూర హారతిని ఇచ్చి, హారతిని కళ్ళకు అద్దుకోవాలి.

8. భగవంతునికి తాంబూలం సమర్పించాలి.

9. భగవంతునికి భక్తి శ్రద్ధలతో నమస్కరించి, నైవేద్యాన్ని దైవ ప్రసాదంగా కళ్ళకద్దుకొని స్వీకరించాలి.

**పండుగలు – విభాగాలు**

పండుగలు ఏర్పడే విధానాన్ని బట్టి పండుగలను మూడు విధాలుగా విభజించవచ్చు.

1. **ప్రకృతి పరంగా వచ్చే పండుగలు**
2. **పౌరాణికంగా వచ్చే పండుగలు**
3. **జాతీయపండుగలు.**

పై మూడు విధాలైన పండుగల లోని ముఖ్యమైన పండుగల గురించి, వాటిని ఆచరించే విధానాల గురించి తెలుసుకుందాం.

**1. ప్రకృతి పరంగా వచ్చే పండుగలు:-**

సూర్యచంద్రుల గమనం వల్ల, ఋతువుల మార్పుల వలన ఈ పండుగలు ఏర్పడతాయి. వీనిలో మకరసంక్రాంతి, ఉగాది, వినాయకచవితి, ఏరువాక ముఖ్యమైనవి. వానిని గురించి తెలుసుకుందాం.

**మకరసంక్రాంతి**

**సంక్రాంతి పండుగ వచ్చింది**
**సరదాలెన్నో తెచ్చింది**

సంక్రాంతి పండుగనే మకర సంక్రాంతి అనికూడా పిలుస్తారు. తెలుగు పంచాంగం ప్రకారం సూర్యుడు సంక్రాంతి రోజున మకరరాశిలో ప్రవేశిస్తాడు కనుక దానికి ఆపేరు వచ్చింది. సంక్రాంతి తోనే ఉత్తరాయణపుణ్యకాలం మొదలవుతుంది. మకర



సంక్రాంతిని భోగి, సంక్రాంతి, కనుమ అనే పేర్లతో మూడు రోజులు నిర్వహిస్తారు.

**భోగి :-**

భోగి నాటి వేకువ ఇంట్లో ఉండే పనికిరాని వస్తువులను మంటల్లో వేసి కాలుస్తారు. ఇంట్లో ఉండేవారందరూ భోగిమంటల చుట్టూ చేరి చలి కాచుకుంటారు. వీటినే భోగిమంటలు అంటారు. భోగి నాటి ఉదయం వండే పొంగలిని 'భోగి పొంగలి' అని, సాయంకాలం పసిపిల్లల తల మీద రేగుపండ్లు పోసి చేసే వేడుకను 'భోగిపండ్లు' అని పిలుస్తారు. భోగినాడు గౌరీపూజచేయడం, బొమ్మలకొలువు పెట్టడం తెలుగునాట ఆచారంగా ఉంది.

**సంక్రాంతి :-**

ఉత్తరాయణపుణ్యకాలం ప్రారంభమైన ఈ రోజున పితృదేవతలకు తర్పణలు విడిస్తే వారికి



పుణ్యలోకాలు కలుగుతాయని నమ్మకం. సంక్రాంతి నాడు పిల్లలు పెద్దలకు నమస్కరించి, దీవెనలు పొందుదారు. దీనిని 'మొక్కుల పండుగ' అంటారు. సంక్రాంతి నాడు దానాలు చేయడం, కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో కలిసి విందులు, వినోదాలలో పాలుపంచుకోవడం మన ఆచారం.

**కనుమ :-**

మూడవనాటి కనుమపండుగ పశువులకు సంబంధించింది. ఈరోజు రైతులు తమకు వ్యవసాయంలో బాసటగా నిలిచిన పశువులను అలంకరిస్తారు. పొంగలి వండి దేవతలకు నైవేద్యం పెడతారు. ఆ పొంగలిని పసుపు కుంకుమలతో కలిపి పొలాల్లో చల్లుతారు. దీన్ని 'పొలిచల్లడం' అంటారు. ఇలా చల్లితే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం. పశువులతో పాటు, వ్యవసాయపరికరాలను పూజించడం, వృత్తి పనివాళ్ళకు ధాన్యాన్ని పంచి ఇవ్వడం తెలుగువారి సంప్రదాయం.



సాయంకాలం ఊరిపొలిమేరల్లో ఎడ్లపందేలు, పొట్టేల పోటీలు జరుగుతాయి. కనుమ పండుగ మరునాడును 'ముక్కనుమ' అంటారు.

సంక్రాంతి నాటికి దక్షిణ భారతదేశంలో పంటలు ఇంటికి చేరుతాయి. రైతులు తృప్తిగా ఉంటారు. చుట్టూ ఉన్నవారికి దానధర్మాలు ఇచ్చి తృప్తి కలుగజేస్తారు. క్రొత్తగా పెండ్లయిన దంపతులను కొత్తబట్టలతో సత్కరించడం, అరిసెలు మొదలైన పలురకాల పిండివంటలు చేయడం సంక్రాంతి ప్రత్యేకత.

**ఉగాది**

**ఉగాది పండుగ వచ్చింది**
**ఉషఃకాంతులను తెచ్చింది**
**వసంతఋతువుకు స్వాగతమంటూ**
**కోకిలమ్మలు పాడసాగినవి.**

ఋతువుల్లో మొదటిది వసంతం. మాసాల్లో మొదటిది చైత్రం. పక్షాల్లో మొదటిది శుక్లపక్షం. తిథుల్లో మొదటిది పాడ్యమి. ఆది అంటే మొదలు అని అర్థం కదా! ఇన్ని ఆదులు కలిసిన రోజును ఉగాది లేక యుగాది అని పిలుస్తారు. ఇది చైత్రశుద్ధపాడ్యమి రోజున జరుపుకుంటాం.

ఉగాది రోజున ఇంటిని శుభ్రం చేసి అలంకరిస్తారు. క్రొత్త బట్టలు ధరిస్తారు. ఉగాది పచ్చడిని ఆరగిస్తారు. ఈ ఉగాది పచ్చడి ఆరు రుచుల సమ్మేళనం. ఇందులో తీపికోసం బెల్లం, పులుపుకోసం చింతపండు, వగరుకోసం మామిడి పిందె, చేదుకోసం వేపపూత, ఉప్పుకోసం సముద్రపుటుప్పు, కారం కోసం పచ్చి మిరపకాయలు కలుపుతారు. సుఖ దుఃఖాలతో కూడి



ఉండే జీవితానికి గుర్తుగా ఈ పచ్చడిని సేవిస్తారు. ఈ పచ్చడి రక్తాన్ని శుద్ధిచేసి ఆరోగ్యాన్ని కలిగిస్తుందని ఆయుర్వేదం చెపుతుంది.

ఉగాది సాయంకాలం తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలతో కూడిన పంచాంగ శ్రవణం చేస్తారు. తాము పుట్టిన నక్షత్రాలను బట్టి ఆ సంవత్సరం తమకు జరిగే మంచిచెడులు, ఆదాయవ్యయాలు, పంటల వివరాలు మొదలైన విశేషాలు ముందుగానే తెలుసుకుని తదనుగుణంగా వ్యవహరిస్తారు. వ్యాపారం చేసేవాళ్ళు ఈ రోజే కొత్త ఖాతాపుస్తకాలను ప్రారంభిస్తారు. తెలుగువారి కాలమానంలోని ప్రభవ నుండి అక్షయ వరకు గల అరవై సంవత్సరాలు ఉగాదితోనే ఆరంభమవుతాయి. అంటే ఇది మనకు నూతన సంవత్సరారంభమన్నమాట.



## 3. వినాయకచవితి

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥**
**అగజాననపద్మార్కం గజానన మహర్నిశమ్**
**అనేకదం తం భక్తానామ్ ఏకదంత ముపాస్మహే ॥**

వినాయకుడు విఘ్నాలకు నాయకుడు. ప్రమథగణాలకు అధిపతి. ఆయన పుట్టినరోజైన భాద్రపదమాసం శుక్ల చతుర్థి నాడు వినాయచవితిని జరుపుకుంటున్నాం.

గజాసురుడు తపస్సు చేసి, శివుని మెప్పించి, ఆయన తన పొట్టలో ఉండేటట్లు వరాన్ని పొందాడు. ఆ విషయం తెలుసుకొన్న పార్వతి తన భర్తను కాపాడుమని విష్ణువును ప్రార్థించింది. విష్ణువు గంగిరెద్దుల వాని వేషంలో వెళ్ళి శివుని కాపాడాడు. గజాసురుని శిరస్సు ముల్లోకాలలో



పూజలు అందుకొనే విధంగా చేస్తానని, అతని చర్మాన్ని తాను ధరిస్తానని శివుడు అతనికి మాట ఇచ్చి కైలాసానికి బయలు దేరాడు. భర్త రాకను గురించి తెలిసిన పార్వతి నలుగుపిండితో ఒక బొమ్మను చేసి వాకిట కాపుగా ఉంచి, స్నానానికి వెళ్ళింది. శివుడు కైలాసానికి వచ్చి లోనికి వెళ్ళబోగా, వాకిట ఉన్న బాలుడు అడ్డగించాడు. శివునికి కోపం వచ్చింది. అతని తల ఖండించి లోపలికి వెళ్ళాడు.

శివపార్వతులు సంభాషించుకొనే సమయంలో ఆ బాలుని ప్రస్తావన వచ్చింది. తాను బాలుని సంహరించానని శివుడు చెప్పడంతో పార్వతి దుఃఖించింది. శివుడామెను ఓదార్చి, గజాసురుని తలను బాలుని మొండానికి అతికించి ప్రాణంపోసి, గజాననుడు అని పేరు పెట్టాడు. అతనిని శివపార్వతులు పుత్రప్రేమతో పెంచసాగారు. అతని వాహనం అనింద్యుడు అనే ఎలుక.

విఘ్ననాయకుడైన వినాయకుడు విఘ్ననివారణ కోసం దేవతలు అర్పించిన కుడములు, ఉండ్రాళ్లు కడుపునిండా తిని తల్లిదండ్రులకు నమస్కరించబోయాడు. సాష్టాంగ నమస్కారం చేయడానికి ఇబ్బందిపడుతూ ఉంటే అతనిని చూచి చంద్రుడు నవ్వాడు. తన కుమారుని చూచి నవ్వినందుకు పార్వతి కోపించింది. చంద్రుని చూచిన వారందరూ నీలాపనిందల పాలవుతారని శపించింది. ఆ శాపప్రభావంతో సప్తఋషుల భార్యలు అపనిందలపాలయ్యారు. శాపాన్ని ఉపసంహరింపుమని బ్రహ్మ కోరడంతో "ఏరోజు వినాయకుని చూచి చంద్రుడు నవ్వాడో, ఆరోజు చంద్రుని చూడకూడదు" అని పార్వతి శాపాన్ని సవరించింది. అందుచేత వినాయక చవితినాడు ఎవ్వరూ చంద్రుని చూచేవారు కాదు.



కృష్ణుడు ఒకరోజు వినాయకచవితి నాడు పాలలో చంద్రుని తిలకించాడు. తత్ఫలితంగా శమంతకమణిని దొంగిలించినట్లు, సత్రాజిత్తు తమ్ముని చంపినట్టు నీలాపనింద కలిగింది. ఆ అపనిందను నివారించుకోవడం కోసం కృష్ణుడు అడవికి వెళ్ళి, ఆనవాళ్ళు ఆధారంగా జాంబవంతుని గుహకు వెళ్ళాడు. అతనిని జయించి, శమంతకమణిని తీసుకొని ద్వారకకు వచ్చాడు. మణిని సత్రాజిత్తుకు తిరిగి ఇచ్చాడు. సత్రాజిత్తు తాను మోపిన నీలాపనిందకు బాధపడుతూ, ఆ మణిని, తనకూతురు సత్యభామను కృష్ణునికి ఇవ్వబోయాడు. కృష్ణుడు సత్యభామను మాత్రం గ్రహించి, మణిని నిరాకరించాడు. అప్పటినుండి వినాయకచవితినాడు గణపతిని పూజించి, శమంతకమణి కథను వింటే చంద్రుని చూచిన దోషం కలుగదని కృష్ణుడు వరమిచ్చాడు.



ఒకసారి గణాలకు అధిపతిని నియమించ వలసిన అవసరం కలిగింది. ముల్లోకాల్లోని పుణ్యనదుల్లో ఎవరు ముందు స్నానం చేసి తిరిగివస్తారో, వారికి ఆ పదవి ఇస్తానని శివుడు చెప్పాడు. వెంటనే కుమారస్వామి నెమలి వాహనం పై బయలుదేరాడు. వినాయకుడు మాత్రం తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేసి ఊరుకున్నాడు. తల్లిదండ్రులకు వినాయకుడు ప్రదక్షిణం చేయడం వల్ల ముల్లోకాల్లోని పుణ్యనదుల్లో స్నానం చేసిన పుణ్యం అతనికి లభించింది. దానితో కుమారస్వామి ఏ నది దగ్గరకు వెళ్ళినా అప్పటికే వినాయకుడు ఆ నదిలో స్నానం చేసి వస్తూ కనిపించేవాడు. కుమారస్వామి ఓటమిని అంగీకరించడంతో వినాయకుడు గణపతి అయ్యాడు. హిందువులే కాదు దేవతలు కూడా ప్రతిపనిని వినాయక పూజతోనే ఆరంభిస్తారు.



వినాయకచవితి నాడు ప్రొద్దుటే స్నానం చేయాలి. పీటపై వినాయకుని విగ్రహాన్ని ఉంచి, పైన గొడుగును అమర్చాలి. మాచీ, బృహతీ, బిల్వ, దూర్వా, దుత్తూరం, బదరి, అపామార్గ, తులసి, చూతం, కరవీరం, విష్ణుక్రాంతం, దాడిమ, దేవదారు, మరువకం, సిందువారం, జాజి, గండకి, శమీ, అశ్వత్థం, అర్జున, అర్క పత్రాలతో పూజించి కుడుములు, ఉండ్రాళ్ళు, పండ్లు నివేదంగా సమర్పించి పూజలు చేయాలి. వినాయక వ్రతకల్పం పఠించాలి. శమంతకమణి కథను చదివి హారతి ఇవ్వాలి. మరునాడు విగ్రహాన్ని పత్రితోపాటు నిమజ్జనం చేయాలి.

కొన్ని ప్రాంతాల్లో వినాయక పూజను తొమ్మిదిరోజులు చేస్తారు. దీన్ని గణపతి నవరాత్రోత్సవం అంటారు. వినాయకచవితి ఉత్సవాలు భారతదేశమంతటా

వైభవంగా జరుగుతాయి. పత్రిని నీళ్ళలో కలపడం వల్ల ఆ ఆకుల్లో ఉండే ఔషధీగుణాలు వ్యాధికారక క్రిములను నశింపజేసి, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి.

## 4. ఏరువాక

**ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా**
**నీ కష్టమంత తీరేరో రన్నో రైతన్నా!**

ఇది రైతుల పండుగ. ఇది ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో శుద్ధపౌర్ణమినాడు వస్తుంది. ఏరు అంటే నాగలి. వాక అంటే దుక్కి ప్రారంభం. ఏరువాక అంటే నాగలితో దుక్కి దున్నడం ప్రారంభించే రోజు అని అర్థం. ఇది వర్షఋతువులో వస్తుంది. ఆరోజులల్లో వర్షాలు కురిసి భూములు పదునుకు వస్తాయి. అది విత్తనాలు వేయడానికి



అనువైన కాలం. అందుచేత ఏరువాకనాడు రైతులు వ్యవసాయపు పనులు మొదలు పెడతారు.

ఏరువాక నాడు రైతులు ఎద్దులను అలంకరించి, పొంగలి చేసి, నాగళ్ళను, గొర్రులను తీసుకొని మంగళ వాద్యాలతో పొలాలకు వెళతారు. నాగలిని పూజించి దున్నడం ప్రారంభిస్తారు. ఏరువాక సందర్భంగా ఊరి వాకిటికి ఒక పుంటినారతో చేసిన తోరణం కడతారు. ఆ తోరణాన్ని గ్రామ ప్రజలు చేరుకోలతో కొట్టి పీచుగాచేసి, ఎవరికి దొరికిన పీచును వారు తీసుకుపోయి ఇండ్లలో ఉంచుకుంటారు. ఇది పశువులకు మేలు చేస్తుందని రైతులు నమ్ముతారు. దేశానికి అన్నం పెట్టే రైతులు పాటించే పండుగ కాబట్టి ప్రజలందరూ ఏరువాక తమ పండుగ గానే భావించాలి.



## 5. రక్షాబంధన్ - శ్రావణపూర్ణిమ

**అన్నా! అన్నా! కడతా రక్ష!**
**చెల్లీ! చెల్లీ! ఆపదలొస్తే నే నీ రక్ష!**

ప్రాచీన భారతీయులు ప్రతిపనిని ఋతువుల ననుసరించే ఆరంభించేవారు. అదే విధంగా విద్యారంభానికి నిర్ణయించిన కాలం శ్రావణపూర్ణిమ. ఆ రోజు వేదం అభ్యసించాలని అభిలషించేవాళ్ళందరూ వేదాధ్యయనం మొదలుపెట్టేవాళ్ళు. అప్పటికే వేదం చదివిన వాళ్ళయితే వాళ్ళు చదివిన వేదమంత్రాలు మరచిపోకుండా మననం చేసుకునే వారు. వేదాధ్యయనం అనే దీక్ష కోసం శ్రావణపూర్ణిమ నాడు కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించడం వేదం చదివే బ్రాహ్మణులకు ఆచారమయింది. ఈ ప్రభావంతో ఇతర వర్గాల వాళ్ళు ఏదైనా క్రొత్తపనిని



ప్రారంభించే సమయంలో ముందుగా రక్షాబంధం కట్టుకోవడం ఆచారంగా మార్చుకున్నారు.

ఇంద్రుడు రాక్షసులతో జరిగిన యుద్ధంలో ఓడిపోయాడని, అతనికి రక్ష కట్టి పంపితే విజయం సాధించాడని పురాణకథలు చెపుతున్నాయి. దీనిని మొగలాయిల కాలంలో స్త్రీల రక్షణకోసం రాజపుత్రవీరులు అనుసరించారు. తనకోటను గుజరాత్ నవాబు బహదుర్‌షా ముట్టడించినప్పుడు తనను, తన కోటను రక్షించవలసినదిగా చిత్తూరు మహారాణి కరావతి హుమయూన్‌కు రక్షా బంధనం పంపింది. అతడు ఆమెను సోదరిగా భావించి, ఆమెను రక్షించి, రాజ్యాన్ని కాపాడాడు. అదే కాలక్రమంలో సోదరి సోదరునికి కట్టే రక్షగా రూపాంతరం చెంది సంప్రదాయంగా మారింది.

రాఖీ అనేది దారంతో, కాగితంతో చేసిన అందమైన ఆభరణం. దీనిని సోదరి పండుగనాటి ఉదయం సోదరుని ముంజేతికి కడుతుంది. సోదరుడు మధ్యాహ్నం సోదరి ఇంట్లో భోజనం చేసి తన స్థితిని బట్టి ఆమెకు నగలు, చీరలు, సొమ్ము బహుమతిగా ఇస్తాడు.

## 6. గురుపూర్ణిమ

**వ్యాసుడు ప్రపంచానికే మహాగురువు**
**వ్యాసుణ్ణి మించిన జ్ఞానే లేడు**
**వేదాలను విభజించాడు**
**పురాణాలు రచియించాడు**
**పంచమవేదంగా భాసించే**
**భారతాన్ని విరచించాడు.**



గురువు అంటే పెద్ద అని అర్థం. విద్యా విషయంలోను, జీవితానికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ విద్యార్థులకు అదర్శంగా నిలిచేవాడే నిజమైన గురువు. అందుచేతనే తల్లిదండ్రుల తరువాత స్థానాన్ని గురువుకి ఇచ్చారు. గురువును పరబ్రహ్మతో పోల్చారు.

వ్యాసుడు సత్యవతీ పరాశరుల కుమారుడు. కళానిధి. తపశ్శాలి. జ్ఞానసంపన్నుడు. ఆయన వేదాలను అధ్యయనం చేసి వాటిని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని నాలుగు వేదాలుగా విభజించి వేదవ్యాసుడు అయ్యాడు. పంచమవేదంగా ప్రసిద్ధికెక్కిన మహాభారతాన్ని రచించాడు. హిందువులకు పరమపవిత్రమైన భగవద్గీత మహాభారతంలో ఒక భాగమే. అంతేకాదు. ఆయన మత్స్య, మార్కండేయాది పద్దెనిమిది



పురాణాలను రచించాడు. నిజానికి వ్యాసుడు సృష్టించినంత వాఙ్మయాన్ని సృష్టించిన వ్యక్తి ప్రపంచవాఙ్మయంలో మరొకడు కనిపించడు.

అటువంటి మహాత్ముడైన వ్యాసుని అవతారదినం గురుపూర్ణిమగా ప్రసిద్ధిచెందింది. దీనినే వ్యాసపూర్ణిమ అని కూడా అంటారు. ఈ పండుగ ఆషాఢమాసంలో పూర్ణిమ రోజు జరుపుకుంటారు. ఈ పండుగనాడు క్రొత్త అంగవస్త్రాన్ని పరచి, దానిపై బియ్యం పోయాలి. బియ్యం మీద నిమ్మకాయలు ఉంచాలి. పూజ చేసిన తరువాత ఆ బియ్యాన్ని తలా పిడికెడు తీసుకొని వెళ్ళి తమ ఇండ్లలోని బియ్యంలో కలుపుకోవాలి. శంకరాచార్యులు ఈ పండుగను ప్రారంభించాడని అంటారు. అందుకే శంకరపీఠాల్లో వ్యాసపూర్ణిమను వైభవంగా నిర్వహిస్తారు. విద్యార్థులు కూడా వ్యాసపూర్ణిమనాడు తమ తమ గురువులను సన్మానించడం జరుగుతూ ఉంది.



**పౌరాణికంగా వచ్చే పండుగలు :-**

పురాణపురుషుల జన్మదినాలను, ధర్మసంస్థాపన కోసం ఉద్భవించిన దేవతలు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసిన సందర్భాలను స్మరించుకుంటూ నిర్వహించే పండుగలను పౌరాణిక పండుగలు అంటారు. శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, మహాశివరాత్రి, దీపావళి, దసరా నవరాత్రులను పౌరాణిక పండుగలుగా చెప్పుకోవచ్చు.

## 1. శ్రీరామనవమి

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే**

విష్ణుమూర్తి దశావతారాల్లో రామావతారం ఏడవది. రావణుడు మొదలైన దుష్టరాక్షసులను సంహరించి ధర్మాన్ని కాపాడడానికి విష్ణువు త్రేతాయుగంలో

రామునిగా అవతరించాడు. దశరథుడు చేసిన పుత్రకామేష్టి ఫలంగా రాముడు కౌసల్యకు చైత్రశుద్ధనవమి నాడు పునర్వసు నక్షత్రంలో జన్మించాడు. అతని భార్య సీత! సీతారాములు ఆదర్శదంపతులు.

రాముడు పితృవాక్యపాలనకు, ఏకపత్నీవ్రతానికి, సత్యపరాక్రమాలకు, ధర్మపాలనకు ప్రతీక. సీత పతివ్రతా శిరోమణి. సోదరుడు లక్ష్మణుడు సోదర భక్తికి తార్కాణం. రామభక్తుడైన హనుమంతుడు మహిమాన్వితుడు.

చైత్రశుద్ధ పాడ్యమినుంచి అంటే ఉగాది నుంచి శ్రీరామనవరాత్రోత్సవాలు ప్రారంభిస్తారు. ఈ తొమ్మిది రోజులు పగలు రామాయణం చదువుతారు. రాత్రివేళ రామకథలతో కాలక్షేపం చేస్తారు. నవమినాడు రామజననఘట్టాన్ని చదివి పూజలు చేస్తారు. అటు భద్రాచలంలోనూ, ఇటు ఒంటిమిట్టలోనూ, ఇంకా ఇతర



రామాలయాల్లోనూ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు.

ఇతరపండుగలమాదిరిగా శ్రీరామనవమికి భక్ష్యభోజ్యాలు ఉండవు. వడపప్పు, బెల్లపుపానకం దేవునికి ఆరగింపు చేసి భక్తులకు ప్రసాదంగా పంచిపెడతారు. ఈ వడపప్పులో పెసరపప్పుతోపాటు తురిమిన పచ్చికొబ్బరి, లేతమామిడి ముక్కలు కలుపుతారు. దీనికి పణ్యారం అనే పేరు కూడా ఉంది. అలాగే పానకంలో మిరియాల పొడి కలుపుతారు.

శ్రీరామ అనే పేరును కోటిసార్లు రాయడాన్ని ' 'రామకోటి' అంటారు. శ్రీరామనవమినాడు ప్రారంభించి, రామకోటి పూర్తయిన సంవత్సరం శ్రీరామనవమినాడు ఆ పుస్తకాలను రామాలయంలో సమర్పించి పూజలు చేస్తారు.



రామునిలా ఉండగలిగితే మనిషి మహాత్ముడవుతాడు. రామునిలా పాలించగలిగితే ప్రజలు సుఖపడతారు.

శ్రీరాముని దివ్యగాథను వాల్మీకి రామాయణంగా రచించాడు.

## 2. శ్రీకృష్ణాష్టమి

**చేత వెన్నముద్ద చెంగల్వపూదండ**
**బంగరు మొలతాడు పట్టుదట్టి**
**సందెతాయతులను సరిమువ్వగజ్జెలు**
**చిన్ని కృష్ణ నిన్ను చేరికొలుతు**

విష్ణువు ద్వాపరయుగంలో దుష్టశిక్షణకోసం, శిష్టరక్షణకోసం కృష్ణునిగా జన్మించాడు. దశావతారాల్లో ఇది ఎనిమిదవ అవతారం. కృష్ణుడు జన్మించిన



శ్రావణమాసంలోని బహుళ అష్టమి రోజున, ఈపండుగను జరుపుకుంటారు. దీనికి కృష్ణజయంతి, గోకులాష్టమి, ఉట్లపండగ అనే పేర్లు కూడా ఉన్నాయి.

కృష్ణుడు దివ్యపురుషుడు. సుందరాకారుడు. బలవంతుడు. రాజనీతిజ్ఞుడు. తత్వవేత్త. హిందువుల మతగ్రంథమైన భగవద్గీతను బోధించిన జగద్గురువు. దేవకీవసుదేవులకు అష్టమగర్భంలో జన్మించి యశోదానందుల గృహంలో పెరిగిన కృష్ణుడు ఎందరో రాక్షసులను సంహరించాడు. గోవర్ధనగిరిని ఎత్తడం, కాళీయమర్దనం చేయడం, నరకుని సంహరించడం, ద్రౌపదికి మానరక్షణ చేయడం, కురుక్షేత్రం యుద్ధంలో పాండవులను గెలిపించడం వంటి ఎన్నో మహత్కార్యాలు చేశాడు.

కృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడు. కనుక కృష్ణాష్టమినాడు పగలు ఉపవాసం ఉండి అర్ధరాత్రి పూజలు చేస్తారు. భగవద్గీతను, విష్ణు కథలను పఠిస్తారు. ఇంటిముందు కృష్ణుని పాదాల ముద్రలు వేస్తారు. కృష్ణుడు బాల్యంలో వెన్నలు దొంగిలించేవాడుకదా! దానికి గుర్తుగా ఈ పండుగనాడు ఉట్లు కొట్టే ఆచారం ఉంది. ఎత్తుగా ఒక అడ్డకర్రను ఏర్పాటు చేసి తాడుకట్టి, ఆ తాడుకు ఒక చివర ఉట్టి కడతారు. అందులో రంగునీళ్లు పోస్తారు. తాడు ఒక చివర పట్టుకొని క్రిందికి విడువడం, ఉట్టికొట్టే వ్యక్తి రాగానే అతనికి అందకుండా పైకి లాగడం, ప్రేక్షకులు వినోదించడం ఈ ఆటలోని విశేషం. విష్ణుసంబంధమైన ఆలయాల్లో కృష్ణాష్టమిని వైభవంగా జరుపుతారు.



## 3. మహాశివరాత్రి

త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో శివుడు మూడవవాడు. ఆయన భక్తవశంకరుడు. భక్తులు పిలిస్తే పలికే బోళాశంకరుడు. ముక్కంటి. పాలసముద్రాన్ని మథించేటప్పుడు హాలాహలం జన్మిస్తే లోకరక్షణార్థం దానిని తన కంఠంలో ఉంచుకున్న గరళ కంఠుడు. ఆయన భార్య పార్వతి పరాశక్తి. నివాసం కైలాసం. వాహనం నంది. ఆయన లింగరూపంలో దర్శనమిస్తాడు. 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తే పాపాలు పరిహారమవుతాయి.

శివుడు నటరాజు. నాట్యానికి ఆదిదేవుడు. తన శరీరంలో సగభాగాన్ని పార్వతికి ఇచ్చి అర్ధనారీశ్వరుడయ్యాడు. త్రిమూర్తుల్లో శివుడు లయకారుడు. ఆయన ఆయుధం త్రిశూలం. ఆయన తలమీద గంగ, సిగలో



నెలవంక, మెడలో పాము కనిపిస్తాయి.

శివుడు లింగరూపంలో ఆవిర్భవించిన మాఘ బహుళ చతుర్దశిని మహాశివరాత్రిగా జరుపుకుంటున్నాం. ఆ రోజు ఉపవాసం చేస్తారు. రాత్రి జాగరణ చేస్తారు. పాలు, పెరుగు, పండ్లు, తేనె, నేయి అనే పదార్థాలతో ఏర్పడే పంచామృతంతో అభిషేకిస్తారు. శివస్తోత్రాన్నీ, పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తారు.

శివరాత్రినాడు ఉపవాసం చేసి, జాగరణ చేస్తూ శివుని అభిషేకిస్తే కోరికలు నెరవేరుతాయని, మోక్ష ప్రాప్తి కలుగుతుందని భక్తులు నమ్ముతారు. దేశమంతటా శివాలయాల్లో మహాశివరాత్రి కన్నుల పండువుగా నిర్వహించబడుతుంది. మనరాష్ట్రంలో శ్రీశైలం, శ్రీకాళహస్తి, ద్రాక్షారామం, మొదలైన శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి మహావైభవంగా జరుగుతుంది.



## నరక చతుర్దశి – దీపావళి

హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు ఆ బాలగోపాలం ఆనందంగా జరుపుకునే పండుగ నరక చతుర్దశి, దానికి అనుబంధమైన దీపావళి. దీపావళి పండుగ ఆశ్వయుజ బహుళ అమావాస్య నాడు వస్తుంది. దీపావళిని ఉత్తర భారతదేశంలో ఐదురోజులు, దక్షిణభారతదేశంలో మూడురోజులు నిర్వహిస్తారు. దక్షిణభారతంలో ఆ మూడురోజులను నరకచతుర్దశి, దీపావళి, బలిపాడ్యమి అని పిలుస్తారు.

శ్రీకృష్ణుడు సత్యభామతో వెళ్ళి నరకాసురుని చతుర్దశినాడు సంహరించాడని, అందుచేత ఆ దినం నరకచతుర్దశిని జరుపుకుంటున్నారని, నరకుని మరణానికి ఆనందించిన ప్రజలు మరునాడు దీపాలు వెలిగించి పండుగ చేసుకున్నారని అదే దీపావళి అని పురాణాలు

చెపుతున్నారు. విష్ణువు వామనుడుగా వచ్చి బలిచక్రవర్తి తలపై తన పాదముంచి పాతాళానికి తొక్కివేశాడు. ఆ దినం కార్తీక శుద్ధపాడ్యమి. దాన్ని బలిపాడ్యమి అంటారు.

దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. దీపావళి పండుగ నాడు సాయంకాలం ఇంటి ముందు దీపాలు వెలిగిస్తారు. లక్ష్మీదేవిని పూజిస్తారు. బాణసంచా కాలుస్తారు. బాణసంచా పొగ వలన సూక్ష్మజీవులు నశిస్తాయి. పిల్లలు, పెద్దలు ఈ పండుగ వేళ టపాసులు కాలుస్తూ, వినోదిస్తారు. 'తమసోమా జ్యోతిర్గమయ' అనే సిద్ధాంతాన్ని కార్యరూపంలో చూపించే పండుగ ఈ దీపావళి.

## 5. దసరా నవరాత్రులు

నవరాత్రులు ఆశ్వయుజ శుద్ధపాడ్యమితో మొదలై తొమ్మిది రోజులు జరిగి విజయదశమి (దసరా) తో



ముగుస్తాయి. ఈ నవరాత్రులు పరాశక్తి యొక్క తొమ్మిది అవతారాలకు సంబంధించిన పూజలతో జరుగుతాయి. అవతారాలకు సంబంధించిన విశేషాలు ఒకే కాలంలో జరుగకపోయినా ఆయా తిథుల్లో జరిగిన వాటిని నవరాత్రులకు అన్వయించారు. ఆయా అవతార విశేషాలు తెలుసుకుందాం.

1. మహాకాళి :– మధుకైటభ సంహారసందర్భంలో విష్ణువుకు సహకరించింది.

2. మహాలక్ష్మి :– మహిషాసురుని సంహరించింది. అందుకే ఈమె మహిషాసురమర్దిని.

3. మహాసరస్వతి :– శుంభనిశుంభులను సంహరించింది.

4. నంద :– నందుని ఇంట జన్మించి, వసుదేవునితో కారాగారానికి చేరి, 'కృష్ణుని చేతిలో నీవు



మరణిస్తావు' అని కంసుని హెచ్చరించింది.

5. రక్తదంతి :– ఒక రాక్షసుని నోటితో చంపింది. ఆ కారణంతో ఆమె దంతాలు ఎర్రగా మారాయట. అందుకే ఆమెకు ఆ పేరు వచ్చింది.

6. శాకంబరి :– కరువు సమయంలో ప్రజలకు శాకాలు, పండ్లు ప్రసాదించింది.

7. దుర్గ :– దుర్గుడనే రాక్షసుని సంహరించింది.

8. మాతంగి :– మతంగ మహర్షి తపస్సు కారణంగా అతనికి కూతురుగా జన్మించింది.

9. భ్రామరి :– అరుణుడనే అసురుని తుమ్మెదల సాయంతో చంపింది.

ఈ తొమ్మిదిరోజులు ఆ యా రూపాలకు తగినట్లుగా అలంకారాలు, ఆయుధాలు ధరించి జగన్మాత భక్తులకు దర్శనమిస్తుంది



దేవీ నవరాత్రులు తొమ్మిది రోజులు దేవీ భాగవతాన్ని, దేవీ సప్తశతిని పారాయణం చేస్తారు. పగలు ఉపవాసం ఉండి, సాయంకాలం అమ్మవారిని పూజించి నైవేద్యం సమర్పించి, ప్రసాదం స్వీకరిస్తారు. నవరాత్రుల్లోనే సరస్వతీ పూజ ఉంటుంది. దీనితో పాటు దుర్గాష్టమి, మహానవమి, విజయదశమి విశేషదినాలుగా పరిగణిస్తారు.

**సరస్వతీ పూజ :–**

నవరాత్రుల్లో మూలా నక్షత్రం వచ్చిన రోజు చదువులకు మూల దేవత అయిన సరస్వతిని పూజ చేస్తారు. జ్ఞానాన్ని ప్రసాదించుమని పిల్లలు సరస్వతిని ప్రార్థిస్తారు.

**దుర్గాష్టమి :–**

మహిషుడనే రాక్షసుడు ఇంద్రుని సింహాసనం ఆక్రమించాడు. పరాశక్తి వివిధ రకాల ఆయుధాలు ధరించి,

సింహాన్ని వాహనంగా చేసుకొని, అతనిని త్రిశూలంతో వధించింది. ప్రజలు సంతోషంతో "అయిగిరి నందిని" అంటూ దేవిని స్తుతించారు. ఆ దేవి అష్టమి నాడు జన్మించింది కాబట్టి అష్టమినాడు దుర్గాపూజ చేస్తారు. అదే దుర్గాష్టమి.

**మహానవమి :-**

నవరాత్రుల్లో తొమ్మిదవ రోజు మహానవమి. ఆరోజు ప్రజలు తమ ఆయుధాలను, వాహనాలను విశేషంగా అలంకరించి పూజిస్తారు. మహానవమిరోజే భగీరథుడు గంగనుభూమికి తీసుకొనివచ్చాడట. ఈ రోజు అపరాజితాదేవికి పూజలు చేస్తారు.

**విజయదశమి :-**

ఆశ్వయుజ శుద్ధదశమిని విజయదశమి అంటారు. దీనినే దసరా అని కూడా పిలుస్తారు. ఈ



రోజు కొత్త పనులు ప్రారంభిస్తే తప్పక విజయం సిద్ధిస్తుందని పెద్దలంటారు. ఈ పండుగనాడే క్రొత్త వ్యాపారాలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు చేస్తారు. పూర్వకాలంలో రాజులు విజయదశమినాడే దండ యాత్రలకు బయలుదేరేవారు. ఈ విజయ దశమినాడు వివిధవృత్తులకు సంబంధించిన సాధనాలన్నింటిని పూజావేదికపై అమర్చి, పూజించి, మరునాటినుండి వాడుకుంటారు.

విజయదశమి పండుగ నాడు జమ్మిచెట్టును పూజిస్తారు. ఇళ్ళలో బొమ్మల కొలుపులు ఏర్పాటు చేస్తారు. దసరా ఉత్సవాల్లో పులివేషం, పిట్టలదొర వేషం మొదలైన వేషాలతో ప్రజలను మెప్పించి కళాకారులు కానుకలు గ్రహిస్తారు. చదువుకొనే పిల్లలు పంతుళ్లతో తమ ఇళ్లకు వెళ్లి...



**"అయ్యవారికి చాలు ఐదువరహాలు**
**పిల్లవాళ్లకు చాలు పప్పుబెల్లాలు"**

అంటూ పాడితే గ్రామస్థులు పంతుళ్లకు డబ్బు ఇచ్చేవాళ్లు డబ్బిచ్చిన గ్రామస్థుల్ని ఉద్దేశించి,

**"శ్రీరస్తు విజయోస్తు, దీర్ఘాయురస్తు**
**ధన కనక వస్తు వాంఛా సిద్ధిరస్తు**
**బాలల దీవెనలు బ్రహ్మ దీవెనలు**
**జయీా భవ దిగ్విజయీా భవ"** అని దీవించేవాళు

దసరా సందర్భంగా కొందరు "దసరా మామ్మూళు బహుమతులుగా తీసుకుంటారు.

**బతుకమ్మ పండుగ :-**

బతుకమ్మ అంటే గౌరీదేవి. స్త్రీల అయిదవతనాన్ని కాపాడే దేవత. ఈ బతుకమ్మ పండుగను తెలంగాణా



ప్రజలు ఆశ్వయుజ మాసంలో మహాలయ ఆమావాస్య నుండి మహానవమి వరకు జరుపుకుంటారు. పువ్వులతో గౌరమ్మను తయారు చేసి, తొమ్మిది రోజులు పూజలు చేసి, పదవరోజు నీటిలో నిమజ్జనం చేస్తారు.

రాముడు విజయ దశమినాడే రావణుని సంహరించాడు. అర్జునుడు ఉత్తరగోగ్రహణ సమయంలో విజయదశమినాడే కౌరవులను జయించాడు. పాలసముద్రం చిలికినపుడు దేవతల గుర్రం ఉచ్చైశ్రవం జన్మించింది కూడా విజయదశమి రోజునే. అందుచేతనే ఉత్తరభారతదేశంలో విజయదశమికి రామలీల జరుపుతారు. దక్షిణదేశంలోని మైసూరులో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

**జాతీయ పండుగలు :-**

కులమత ప్రాంతాలకు అతీతంగా ఆసేతు హిమాచలం భారతీయులందరూ జరుపుకునే పండుగలను జాతీయపండుగలు అంటారు. అలాంటి వాటిలో స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్రదినోత్సవం, గాంధీ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం, బాలల దినోత్సవం ముఖ్యమైనవి.

**1. స్వాతంత్ర్య దినోత్సవం**

**ఎగురవే వినువీథి ఎగురవే జెండా**
**శాంతిదూతగ నేడు జాతీయజెండా**
**యుగయుగంబుల జగతి నెగురవే జెండా**
**సౌఖ్యప్రదాతగా స్వాతంత్ర్యజెండా** - సుంకర



వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు రాజుల మధ్య అనైక్యత ఆధారంగా దేశాన్ని క్రమంగా హస్తగతం చేసుకున్నారు. ఇంగ్లాండు రాణి పేర పరిపాలన చేస్తూ భారతదేశ సంపదను దోచుకున్నారు. భారతీయులను బానిసలుగా చూస్తూ అనేకమైన హింసలకు గురిచేశారు. బానిసత్వ శృంఖలాలు త్రెంచుకోవాలని, స్వేచ్ఛావాయువులు పీల్చుకోవాలని భారతీయులు భావించారు. 1857 లో సిపాయిలు తిరుగుబాటు చేశారు. అది విఫలమయింది. క్రమంగా భారతీయుల్లో స్వేచ్ఛను సాధించుకోవాలనే కోరిక బలపడింది. దానికోసం 1885 లో భారతజాతీయ కాంగ్రెసు ఏర్పడింది. ఈ స్వాతంత్ర్యసమరంలో ఎందరో దేశభక్తులు మరణించారు. మరెందరో జైలు శిక్షలు అనుభవించారు. గాంధీజీ నేతృత్వంలో అహింస ఆయుధంగా భారతదేశమంతా ఒక్కటై ఆంగ్లేయులకు



వ్యతిరేకంగా పోరాటం చేసింది. భారతీయుల మనోభావాలను గ్రహించిన ఆంగ్లేయులు 1947 ఆగస్టు 15 వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించారు. అప్పటినుంచి మనం ప్రతిసంవత్సరం ఆగష్టు 15 వ తేదీన స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుంటున్నాం.

స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఢిల్లీలోని ఎర్రకోటపై భారతప్రధాని జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రరాజధానుల్లో ముఖ్యమంత్రులు, జిల్లాకేంద్రాల్లో మంత్రులు మువ్వన్నెల జెండాలను ఆవిష్కరిస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యాసంస్థల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించి, జాతీయ గీతాలను, దేశభక్తి గీతాలను ఆలపిస్తారు. దేశభక్తులసేవలను స్మరించుకుంటారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఒక కవి స్వాతంత్ర్యం



గురించి ఏమన్నాడో చదివితే స్వాతంత్ర్యం విలువ తెలుస్తుంది.

**పారతంత్ర్యమందు పాయసాన్నముకంటె**
**గంజి మేలు స్వేచ్ఛ కలిగెనేని**
**స్వేచ్ఛలేనిసుఖము తుచ్ఛపుసుఖమురా**
**నవయుగాలబాట నార్లమాట**
- నార్ల వెంకటేశ్వర రావు

**2. గణతంత్రదినోత్సవం**

**జయ జయ జయ ప్రియభారత**
**జనయిత్రీ దివ్యధాత్రి**
**జయ జయ జయ శతసహస్ర**
**నరనారీహృదయనేత్రి**
- దేవులపల్లి

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి రాజ్యాంగపరిషత్తు ఏర్పాటయింది. అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగం తయారయింది. దీనిని 1950 జనవరి 24 వ తేదీన జాతీయ అసెంబ్లీ ఆమోదించి, జనవరి 26 నుంచి రాజ్యాంగం అమలులోనికి వస్తుందని ప్రకటించింది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాత్రం ప్రాతిపదికలుగా, మనదేశం సర్వతంత్ర ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించింది. అందుకు చిహ్నంగా ప్రతిసంవత్సరం జనవరి 26 వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

జాతీయజెండాను రూపొందించింది మన తెలుగువాడైన పింగళి వెంకయ్యగారే. జెండాలో మూడు



రంగులుంటాయి. పైన కాషాయం, మధ్యలో తెలుపు, క్రింద ఆకుపచ్చ ఉంటాయి. తెలుపురంగు మధ్యలో అశోకధర్మచక్రం ఉంటుంది.

గణతంత్రదినోత్సవం సందర్భంగా రాజపథ్‌లో రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, సైనిక వందనాన్ని స్వీకరిస్తారు. వివిధ రంగాలలో కృషి చేసిన వారికి కేంద్రం పద్మ అవార్డులను, యుద్ధంలో మరణించిన వారికి వీరచక్ర అవార్డులను ప్రదానం చేస్తారు. జాతీయగీతాన్ని, దేశభక్తిపాటలను ఆలపిస్తారు. స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్న నాయకుల త్యాగాన్ని స్మరించుకుంటారు. సమైక్యంగా జాతి అభివృద్ధికి కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేస్తారు.



## 3. గాంధిజయంతి

**కొల్లాయి కట్టితేనేమి?**
**మా గాంధి కోమటై పుట్టితేనేమి**
**వెన్నపూసా మనసు కన్నతల్లిప్రేమ**
**పండంటిమోముపై బ్రహ్మతేజస్సు**

భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహాత్ముడు గాంధీజీ. అహింస, సత్యాగ్రహం, ఆయుధాలుగా స్వాతంత్ర్యం సాధించడంతో పాటు జాతి సమైక్యత కోసం, హరిజనోద్ధరణ కోసం, మద్యపాన నిషేధం కోసం ఆయన అవిశ్రాంతంగా కృషిచేశారు. అంటరాని తనాన్ని అంతరింపజేయాలని, సమానత్వం సాధించాలని, ఆయన కోరిక. శాంతి, సత్యం, అహింస, మానవత్వం, ప్రేమ లక్షణాలుగా రామరాజ్య స్థాపన



జరగాలని ఆయన ఆకాక్షించేవారు. గాంధీజీ 'సత్యంతో నా అనుభవాలు' అనే గ్రంథాన్ని రచించడంతోపాటు అనేక పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు. అన్నిమతాలు ఒక్కటే అని బోధించారు. అందుకే ఆయనను జాతిపితగా గౌరవించుకుంటున్నాం. 'బాపూ' అని పిలుచుకుంటున్నాం. ఆయన 1869 అక్టోబరు 2 వ తేదీని జన్మించారు. ఆయన జన్మదినమైన అక్టోబరు 2 వ తీదీని గాంధీజయంతిగా జరుపుకుంటున్నాం.

గాంధీజయంతి రోజు దేశప్రజలందరూ గాంధీజీని స్మరించుకుంటారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటారు. ఆయన బోధనలు మననం చేసుకుంటారు. ఆయన సిద్ధాంతాలను బాలబాలికలకు తెలియజేస్తారు. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ లోని గాంధీసమాధిని దర్శించి ప్రముఖులందరూ నివాళులు అర్పిస్తారు. సర్వమత

ప్రార్థనలు చేస్తారు. ఐక్యరాజ్యసమితి గాంధీ జన్మదినమైన అక్టోబరు 2 వ తేదీని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించింది. ఆ కారణంచేత భారతదేశంలోని ప్రజలతోపాటు ప్రపంచమంతా గాంధీజీని ఆరోజు స్మరించుకుంటుంది.

## 4. ఉపాధ్యాయ దినోత్సవం

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః**
**గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మా**
**తస్మై శ్రీగురవే నమః ॥**

ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని కలిగిస్తాడు. వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాడు. భవిష్యత్తుకు మార్గం చూపిస్తాడు. మంచి అలవాట్లు నేర్పుతాడు. మంచిని మానవత్వాన్ని



ప్రబోధిస్తాడు. మనిషిగా మారుస్తాడు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానబోధ చేస్తాడు. అందుకే ఉపాధ్యాయుని పూజించాలి. కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉత్సవాలు నిర్వహించాలి. అలాంటి ఉత్సవమే ఉపాధ్యాయ దినోత్సవం.

మనదేశంలో పుట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతత్వవేత్త. గొప్ప ఉపన్యాసకుడు. రాయబారిగా, రాష్ట్రపతిగా వ్యవహరిస్తూ తన ఉపన్యాసాల ద్వారా విదేశాల్లో భారతప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించి, ఉన్నతమైన పదవులు అలంకరించి, గొప్పతత్వవేత్తగా అంతర్జాతీయ కీర్తిగాంచిన రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5 వ తేదీన జన్మించారు. ఎన్నో బిరుదులు పొందారు. ఎన్నో గ్రంథాలు



రచించారు. వారి జన్మదినమైన సెప్టెంబరు 5 వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

ఉపాధ్యాయదినోత్సవం రోజు విద్యాసంస్థల్లో సమావేశాలు ఏర్పాటు చేసి గురువులను పూజిస్తారు. రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉత్తములైన గురువులను గుర్తించి సన్మానాలు చేస్తాయి. ఉపాధ్యాయులు కూడా రాధాకృష్ణన్ స్ఫూర్తిగా వృత్తికి పునరంకితం అవుతారు.

## 5. బాలల దినోత్సవం

**బాలల నవ్వులు మల్లెపూవులు**
**బాలల మాటలు తేనెవాకలు**
**బాలలు అంటే భావి పౌరులు**



**బాలలు అంటే బంతి పూవులు**
**బాలలు అంటే నెహ్రూకిష్టం.**
**చాచా నెహ్రూ బాలల నేస్తం.**

భారతదేశ తొలిప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు బాలలంటే చాలా ఇష్టం. పిల్లలు ఆయనను చాచాజీ అని పిలిచేవారు. ఆయన 1889 నవంబరు 14 వ తేదీన జన్మించారు. గాంధీజీ అనుచరునిగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. జైలు శిక్షలు అనుభవించారు. 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే పుస్తకాన్ని రచించారు. ఆయన నవభారతనిర్మాత. ఆయనకు బాలలంటే ఇష్టం కాబట్టి ఆయన జన్మదినమైన నవంబరు 14 వ తేదీని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యాలయాల్లో వేడుకలు జరుగుతాయి. నెహ్రూను గురించి, బాలల

హక్కుల గురించి ప్రసంగిస్తారు. బాలల కోసం ప్రభుత్వాలు క్రొత్త పథకాలు ప్రారంభిస్తాయి. బాలలకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు. బాల బాలికలందరూ ఆరోజు ఆనందంగా గడుపుతారు.

* * *



**వినా వేంకటేశం న నాథో న నాథః**

**సదా వేంకటేశం స్మరామి స్మరామి**

**హరే వేంకటేశ! ప్రసీద ప్రసీద!**

**ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ!**